విశాలాంధ్ర కృష్ణా జిల్లా

లక్ష్మీపురం ఆర్‌బీకేలో ఎరువులు

విశాలాంధ్ర-కృత్తివెన్ను : లక్ష్మీపురం ఆర్‌బికేలో రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని సర్పంచ్ పులగం సుబ్రమణ్యం బుధవారం తెలిపారు. యూరియా 5 టన్నులు, డిఏపీ 5 టన్నులు, 20-20-0-13 పది టన్నులు ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. రైతులు ఆధార్ కార్డుతో వచ్చి ఎరువులను సరసమైన ధరలకు కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. ఎరువులు అవసరమైన రైతులు సచివాలయ వ్యవసాయ సహాయ అధికారి నాయక్‌ను సంప్రదించాలని తెలిపారు.

వేగంగా అభివృద్ధి పనులు

విశాలాంధ్ర-మచిలీపట్నం : మచిలీపట్నం నియోజకవర్గంలోని పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయడంతో పాటు కొత్త అభివృద్ధి పనులను ప్రణాళికా బద్ధంగా వేగవంతం చేశామని రాష్ట్ర పర్యాటక, యువజన శాఖ , కృష్ణాజిల్లా ఇన్చార్జ్ మంత్రి ఆర్కే రోజా సెల్వమణి తెలిపారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశపు మందిరంలో మచిలీపట్నం శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని) అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంకు హాజరైన కలెక్టర్ పి. రాజా బాబు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ జిల్లా, నియోజకవర్గ స్థాయి అధికారులు పాల్గొన్నారు. మచిలీపట్నం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి రోజా సమీక్ష నిర్వహించారు. డ్వామా, పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ, గృహ నిర్మాణం,టిడ్కో, ఆర్ డబ్ల్యు ఎస్, విద్యాశాఖ, రెవిన్యూ, వ్యవసాయం, పౌరసరఫరాల శాఖ,మత్స్యశాఖ, మచిలీపట్నం మున్సిపాలిటీ, నీటిపారుదల శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, వైద్య కళాశాల, ఫిషింగ్ హార్బర్, మచిలీపట్నం పోర్టు తదితర శాఖల అధికారుల ప్రగతి నివేదికలను వివరించారు. అనంతరం మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా జనరంజకంగా జగనన్న పాలన కొనసాగుతుందని, మచిలీపట్నం నియోజవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమం జోడు గుర్రాల మాదిరిగా పరుగులు పెడుతుందన్నారు. వివిధ శాఖలను సమన్వయ పరుస్తూ నాణ్యతలో రాజీపడకుండా అభివృద్ధి పనులను చేపట్టేందుకు నియోజకవర్గంలో ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఆమె అన్నారు. పరిపాలన ప్రజల వద్దకు వచ్చినప్పుడే ప్రతి ఒక్క సమస్య ప్రజాప్రతినిధులకు, అధికారులకు తెలిసే అవకాశం ఉంటుందని, స్థానిక ప్రజలకు రైతులకు ఉపయోగపడే విధంగా గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) మాట్లాడుతూ, మచిలీపట్నం నియోజవర్గంలో 4 సంవత్సరాల కాలంలో అధికారులు, సహచర ప్రజా ప్రతినిధులు చక్కని సమన్వయంతో నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంతో కష్టించి పని చేశారని ప్రశంసించారు. ముందు కూడా ఇదే స్పూర్తితో ఉన్న వనరులతో సాధ్యమైనంత పనులు పారదర్శకంగా నిజాయితీగా చేసే విధంగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు, ఆర్డీవో ఐ. కిషోర్, డ్వామా, హౌసింగ్ పీ.డీ. జీ.వీ సూర్యనారాయణ, పంచాయతీరాజ్ ఎస్ ఈ విజయ కుమారి, ఆర్ డబ్ల్యు ఎస్ ఈఇ సత్యనారాయణ రాజు, మచిలీపట్నం కార్పొరేషన్ కమిషనర చంద్రయ్య, తహశీల్దార్ శ్రీవిద్య, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అనితపై దుష్ప్రచారం చేస్తున్న వారిని అరెస్టు చేయాలి

విశాలాంధ్ర-గుడివాడ : తెలుగు మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత పై సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టిన వారిని వెంటనే అరెస్టు చేయాలని తెలుగు మహిళ పట్టణాధ్యక్షురాలు యార్లగడ్డ సుధారాణి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తెలుగు మహిళా నాయకులు తూము పద్మజ, మాదల సునీత, కొల్లి రమ్య, యలమంచిలి సుష్మా, శశికళ, నిమ్మగడ్డ ప్రతిమ, వేమూరి సుజాత, గోరిపర్తి చంద్ర, పలుకుర్తి భాగ్యంలతో కలసి యార్లగడ్డ సుధారాణి మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వంగలపూడి అనిత పై అసభ్య పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవలన్నారు. తెలుగు మహిళల జోలికి వస్తే ఊరుకునేది లేదంటూ చెప్పులు చూపిస్తు హెచ్చరించారు.

జగనన్న సురక్ష..ఓ సేవా దీక్ష

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ప్రజా సమస్యలు నూరు శాతం పరిష్కారానికి జగనన్న సురక్ష క్యాంపులను ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహిస్తోందని జిల్లా ఇన్‌ఛార్జి, రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని 63వ డివిజన్ 273, 276 సచివాలయాల పరిధిలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాల కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ అయ్యాయన్నారు. ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ ప్రజా వినతులను సత్వరం పరిష్కరించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్నకు చెబుదాం లాంటి ప్రత్యేక కార్యక్రమాలను ప్రభుత్వం నిరంతరం అమలు చేస్తోందన్నారు. 63 డివిజన్లలో 969 మందికి కుల, 927 మందికి ఆదాయ, 31 మందికి బియ్యం కార్డులు, ముగ్గురికి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, వివిధ రకాల సేవల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు 2,169 సర్టిఫికెట్లను ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ ఆర్.భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, నగర డిప్యూటీ మేయర్‌లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజారెడ్డి, యూసీడీ పీవో శకుంతల, తహసీల్దార్ మాధురి, అసిస్టెంట్ కమిషనర్ అనసూయ, కార్పొరేటర్ ఎం.తిరుపతమ్మ పాల్గొన్నారు.

ఆధార్ కార్డు డెస్క్

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలోని కూచిపూడి పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఆధార్ కార్డు లోని తప్పులు సరి చేసుకోవడానికి ప్రత్యేకడస్క్ ఏర్పాటు చేశారు. కంకిపాడు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ హరీష్ ఆధ్వర్యంలో కూచిపూడి, బార్లపూడి గ్రామానికి చెందిన ఆధార్ కార్డులలో తప్పులు గల కార్డుదారులకు ఉచితంగా అప్‌లోడ్ చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో 12 మంది కార్డుదారులు హాజరై సరి చేయించుకున్నారు.

జర్నలిస్టు యూనియన్‌లో అంబటి పాత్ర అమోఘం

-సీఆర్ మీడియా అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : జర్నలిస్టు యూనియన్ నేత దివంగత అంబటి ఆంజనేయులు యూనియన్ కార్య కలాపాల్లో తనదైన ముద్ర వేశారని సి.ఆర్.మీడియా అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు కొనియాడారు. ఆంజనేయులు గృహాన్ని బుధ వారం సందర్శించి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అంబటి ఆంజనేయులు చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంజనేయులు నిరంతరం జర్న లిస్టుల సంక్షేమానికి పాటుపడ్డారని ఆయన ప్రస్తుతించారు. స్వతహాగా సౌమ్యులని, రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఆంజనేయులు అనేక పోరాటాలు చేశారని ఆయన గుర్తుచేశారు. చివరి క్షణాల వరకు జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తపించిన నాయకుడని, ఆయన మరణం పాత్రికేయలోకానికి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. దివంగత ఆంజనేయులు కుమారులు అంబటి సంజయ్, అంబటి సంతోష్‌లకు తన సంతాపం తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షులు చావా రవి మాట్లాడుతూ వ్యక్తిగత ఆరోగ్యంతో బాటు తమ అందరి ఆరోగ్యాల పట్ల దివంగత ఆంజనేయులు శ్రద్ధ వహించే వారని చైర్మన్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే యూనియన్ అధ్యక్షులు చావా రవి, కార్యదర్శి కొండా రాజేశ్వరరావు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు నిమ్మరాజు చలపతి రావు, కార్యదర్శి ఆర్ వసంత్, ఐజేయూ కౌన్సిల్ సభ్యులు షేక్ బాబు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దారం వెంకటేశ్వర రావు, పెన్ జాబ్ అధ్యక్షులు బడే ప్రభాకరరావు, ట్రెజరర్ టీ.వి. రంగారావు, సెక్రెటరీ సుమ ఉపేందర్, ప్రముఖ మిమిక్రి కళాకారులు సిల్వెస్టర్, లయన్ వై.రంగారావు, సి.ఆర్. మీడియా అకాడమీ సెక్రెటరీ మామిడిపల్లి బాలగంగాధర తిలక్, ఓ.ఎస్.డి. ఎస్. శ్రీనివాసజీవన్, కంటెంట్ ఎడిటర్ కలమండ శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు కట్టిస్తాం : ఎమ్మెల్యే కైలే

విశాలాంధ్ర-మచిలీపట్నం : అమరావతి ప్రాంతంలో ఇళ్లస్థలాలు కేటాయించిన పేదలకు ఎవరు ఎన్ని అడ్డంకులు కల్పించిన ఇల్లు కట్టించే కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం వెనుకంజ వేయదని పామర్రు శాసనసభ్యులు శాసనసభ హామీల కమిటీ చైర్మన్ కైలే అనిల్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని రహదారులు భవనాలు అతిధిగృహంలో వారు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దళితుల పక్షపాతి అని వారిని అక్కున చేర్చుకుని ప్రోత్సహించి పైకి తేవాలన్నదే వారి అభిమతం అన్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి చేసే ప్రయాణంలో తాము సైనికులుగా వెన్నుదన్నుగా ఉండి పేదలకు ముఖ్యంగా దళితులకు న్యాయం జరిగే విధంగా ముందుకెళతామన్నారు. రాజధానిలో అన్ని వర్గాల ప్రజలు ఉండాలనే ఉద్దేశంతోనే అమరావతి ఆర్ - 5 జోన్ లో పేదలందరికీ 50,793 మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. వారందరికీ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని ఇందుకోసం షేర్ వాల్ టెక్నాలజీ వారితో ఒప్పందం కూడా చేసుకున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి ఇళ్ల నిర్మాణానికి అనుమతి తెచ్చామన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో అవినీతికి చోటు లేదని సంక్షేమ కార్యక్రమాలు అన్ని అర్హత కలిగిన వారికి మాత్రమే పూర్తిగా నేరుగా వారికే జమ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు ఒకవైపు అభివృద్ధి కార్యక్రమాలు మరోవైపు చేపడుతుందన్నారు. రహదారుల నిర్మాణం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పాత్రికేయులు 5వేల మంది పాత్రికేయులకు కూడా అమరావతిలో ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరగా ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకొని పోయి తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. పామర్రు బస్టాండు కొన్ని సంవత్సరాల నుండి పట్టించుకోలేదని ఈ విషయం రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని పోగా ఆయన వెంటనే స్పందించారని అక్కడ బస్టాండు చదును చేసి టెండర్లు ప్రక్రియ జరుగుతుందని ఒక వారం రోజుల్లోగా శంకుస్థాపన చేసి బస్ స్టాండ్ ను బాగు చేస్తామన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

విశాలాంధ్ర-కోడూరు : కోడూరు చెందిన చెన్ను సురేంద్రబాబు మృతి చెందగా ఆ కుటుంబానికి వై.ఎస్.ఆర్. భీమా కింద లక్ష రూపాయిలు మంజూరు కాగా ముందు రూ.10 వేలు సర్పంచ్ వెన్నా పైని సురేంద్రబాబు భార్యకు అందచేసారు. మిగిలిన రూ.90 వేలు ఆమె బ్యాంక్‌లో జమ చేస్తారని తెలి పారు. ఈ కార్యక్రమంలో పరిశె మాధవరావు, బడే గంగాధరరావు, పోతన నాగరాజు పాల్గొన్నారు.

పేదలకు అండగా జగనన్న సురక్ష

విశాలాంధ్ర-బంటుమిల్లి :- జగనన్న సురక్ష కార్యక్రమం నిరుపేదల జీవితాలకు అండగా నిలుస్తుందని బంటుమిల్లి ఎంపీపీ వెలివెల చినబాబు అన్నారు. ఆముదాలపల్లి, నాగేశ్వరరావుపేట సచివాలయాల్లో తహశీల్దార్ ఎం సత్యనారయణ, ఎంపిడిఓ స్వర్ణభారతి అధ్వర్యంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు సత్వర సేవలు అందుతున్నాయన్నారు. గ్రామాలలో సంక్షేమ పథకాలను పొందనివారు ఉండకూడదనే ఉద్దేశంతోనే అధికారులు పేదల ఇంటి ముంగిటకు వచ్చి వివరాలు తెలుసుకుని అవసరమైన ప్రభుత్వ ధృవీకరణ పత్రాలను జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇస్తున్నారని అన్నారు. అనంతరం ఆముదాలపల్లి సచివాలయ పరిధిలో సర్పంచి దాసరి సీయోనుకుమారి 294 ధృవీకరణ పత్రాలను, నాగేశ్వరరావుపేట గ్రామ సచివాలయ పరిదిలోని 294 మందికి ఎంపిపి చినబాబు ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ తిరుమాని శ్రీనివాసరావు, మండల సచివాలయాల కన్వీనర్ కొప్పర్తి సుబ్బారావు, వైసిపి మండలపార్టీ అధ్యక్షులు మలిశెట్టి రాజబాబు, స్నానం మహేష్, డిప్యూటి తహశీల్దారు కట్ట రాంసాయి, సచివాలయాల కార్యదర్శిలు ప్రసన్న లక్ష్మి, దాసరి శ్రీనివాసరావు, సచివాలయాల సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

రవికాంత్‌పై గంజాయి కేసును ఎత్తి వేయాలి

విశాలాంధ్ర-గుడివాడ : అక్రమంగా గంజాయి కేసులో ఇరికించిన మాజీ కౌన్సిలర్ చోరగుడి రవికాంత్‌పై పెట్టిన కేసును ఎత్తి వేయలని లేని పక్షంలో అన్ని రాజకీయపార్టీలకు చెందిన దళితుల ఐక్యతో ఉద్యమాని నిర్వహిస్తామాని దళిత నాయకులు తంగిరాల మోహనదాసు, దారం కరుణకర్, గడ్డం ప్రకాష్‌దాసు, అందుగుల ఏసేబు, వేల్పుల నాగబాబు, కొదమల గంగాధర్, ఇంటూరి గజేంద్ర, మరియబాబులు అన్నారు. బుధవారం స్థానిక పోస్టు అఫీసు రోడ్డులో దళిత సంఘల అధ్వర్యంలో మున్సిపల్ మాజీ ప్రతిపక్షనేత రవికాంత్‌పై అక్రమంగా గంజాయి కేసును ఎత్తి వేయలని కోరుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ కోసం అనేక త్యాగలు చేసిన వ్యక్తిపైనే నేడు అధికారపార్టీకి చెందిన కొంత మంది నాయకులు గంజాయి కేసును పెట్టించడం దారుణమాన్నారు. కుటుంబ తగాదాల కేసులో 7వ తేదిన అరెస్టు చేసిన పోలీసులు, 8వ తేదిన గంజాయి అమ్ముతు రవికాంత్ పట్టు బడడాని చెప్పాడం దారుణమన్నారు. వెంటనే రవికాంత్‌పె పెట్టిన కేసును ఎత్తి వేయకుంటే ఉద్యమాన్ని నిర్వహిస్తామాని హెచ్చారించారు. ఈ కార్యక్రమంలో రవికాంత్ తల్లిందడ్రులు భాగ్యమ్మ, యోహన్, దళిత సంఘాల నాయకులు, పాల్గొన్నారు.

ఎంజిఎన్ఆర్జిఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌కు సన్మానం

విశాలాంధ్ర-కృత్తివెన్ను : ఎండపల్లి ఎనర్జీ ఎం జి ఎన్ ఆర్ జి ఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న రామకృష్ణను ఉపాధి హామీ కూలీలు బుధవారం ఘనంగా సత్కరించారు. ఉపాధి హామీ పథకం ప్రారంభించినప్పటి నుండి ఎంతో సమన్వయంతో పనిచేసి కూలీలందరకి పనిదినాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు. గ్రామంలో ఉన్నటువంటి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఉపాధి హామీ పథకం ద్వారా పనిచేస్తూ కూలీలకు పని కల్పించడమే కాకుండా గ్రామ అభివృద్ధి కూడా తోడ్పడుతున్నారని ప్రశంసించారు.

సమస్యల పరిష్కారమే జగనన్న సురక్ష

విశాలాంధ్ర-పెడన : సమస్యల పరిష్కారమే జగనన్న సురక్ష అని పెడన మున్సిపల్ కమిషనర్ బి మహేంద్ర అన్నారు. పెడన మున్సిపల్ పరిధిలోని బుధవారం 9వ సచివాలయం బ్రహ్మపురం శివాలయం ప్రాంతంలో 22, 23 వార్డులకు జగనన్న సురక్ష క్యాంపు సభ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఎటువంటి రుసుం లేకుండా 11 రకాల సేవలను వాటి పత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెడన పట్టణ వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షులు బందారు మల్లికార్జునరావు, 22వ వార్డు కౌన్సిలర్ మెట్ల సుబ్రమణ్యం, 23వ వార్డు కౌన్సిలర్ ఉమ్మిటీ తనూజ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు ఉపయోగాలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : జగనన్న సురక్షతో పేద ప్రజలకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని సర్పంచ్ గొరుముచ్చు ఉమా అన్నారు. బుధవారం అవనిగడ్డ 5 వ సచివాలయంలో ఇన్‌చార్జ్ ఎం.పి.డి.ఒ శైలజా కుమారి అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి సర్పంచ్ గొరుముచ్చు ఉమా పాల్గొని ప్రసంగించి ధృవపత్రాలను అందచేశారు. ఉపసర్పంచ్ కోడూరు సత్యనారాయణ, తహశీల్దార్ ఎల్ శివరామకృష్ణ, పంచాయితీ వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల సిబ్బంది డిమాండ్లు పరిష్కరించాలి

విశాలాంధ్ర-గన్నవరం : సహకార సంఘాల సిబ్బంది న్యాయ బద్ధమైన డిమాండ్లను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని పిఏసిఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు కొండపల్లి బాలాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆంధ్ర తెలంగాణ బ్యాంక్ ఎంప్లాయిస్ ఎంప్లాయ్ ఫెడరేషన్ పిలుపుమేరకు సహకార సంఘాల సిబ్బంది చేస్తున్న ఆందోళనకు మద్దతుగా గన్నవరం కేడిసిసి బ్యాంక్ వద్ద మధ్యాహ్నం భోజనం విధానం సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కొండపల్లి బాలాజీ మాట్లాడుతూ వేతన సవరణ జరిగిన తర్వాత మాత్రమే బదిలీ చేయాలా అన్నారు. హెచ్ ఆర్ సి పాలసీ వెంటనే అమలు చేయాలని కోరారు సంఘాల్లో 50% ప్రైవేట్ వ్యక్తుల భాగస్వామ్యం విరమించాలని డిమాండ్ చేశారు. జీవో 36 అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా వయోపరిమితి 60 ఏళ్ల నుండి 62 ఏళ్లకు పెంచాలని కోరారు. 2019 తర్వాత నియమించిన సిబ్బందిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఎంవి ప్రశాంత్ సూపర్వైజర్ ఎస్ వి నాగేశ్వరరావు, పిఎసిఎస్ ఉద్యోగుల సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-కూచిపూడి : సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి గ్రామాలలోని ప్రజలు ఏ విధమైన ఇబ్బందులు పడకుండా రూపాయి ఖర్చు కాకుండా కేవలం గంటల స్వల్ప వ్యవధిలోనే ధృవపత్రాలు అందజేయడానికి ఏర్పాటుచేసిన జగనన్న సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ కో ఆప్షన్.సభ్యులు వేమూరి పరిశుద్ధ రాజు పిలుపునిచ్చారు. మొవ్వ మండలంలోని కూచిపూడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దీని ద్వారా 11 రకాల సర్టిఫికెట్లను అందజేస్తున్నారని వివరిస్తూ కూచిపూడి సచివాలయం ద్వారా 1058 మందికి పైగా దరఖాస్తులు దాఖలు చేసుకున్నారంటే వాలంటీర్ల పనితనాన్ని అభినందించారు. గ్రామ సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వెలగం రమణ, ఎంపీపీ కొండేటి ఇందిర, జడ్పిటిసి రాజులపాటి పార్వతి, తాసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్, ఎంపీ ఓ జి సుధాప్రవీణ్, ఈవోపీఆర్డి వీర్ల సీతారామరాజు, పంచాయతీ గ్రేడ్ వన్ కార్యదర్శి ఇస్లావత్.భవాని, సచివాలయం గ్రేట్ ఫైవ్.కార్యదర్శి కే ఆంజనేయులు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్.పి ఉమామహేశ్వరరావు, డీజిల్ అసిస్టెంట్ అరుణ, మహిళా పోలీస్ జీ భార్గవి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వినోద్, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి జగన్న సురక్ష

విశాలాంధ్ర-ఉంగుటూరు : పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం జగన్న సురక్ష అని సర్పంచి లాం దిబోరా అన్నారు. బుద్ధవారం ఉంగుటూరు మండలం తేలప్రోలులో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన వారికీ సర్టిఫికెట్లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో, సర్పంచ్ లామ్ దిబోరా, ఉప సర్పంచ్ వింత ఆదినారాయణ రెడ్డి, వైఎస్ఆర్సిపి గ్రామ కన్వీనర్ వింత వాసు రెడ్డి, పి ఏ సి ఎస్ బ్యాంక్ అధ్యక్షులు తియ్యగూర రామిరెడ్డి, గ్రామ వార్డు కన్వీనర్లు, మండల పరిషత్ అధ్యక్షురాలు వడ్లమూడి సరోజిని, ఎంపీడీవో శేషగిరిరావు, ఎమ్మార్వో వనజాక్షి, వీఆర్వో సునీల్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు పుస్తకాల పంపిణీ

విశాలాంధ్ర-అవనిగడ్డ : ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్ధులకు సెమ్ 2 కు సంబంధించిన టెక్ట్ బుక్స్‌ను మండల విద్యా శాఖాధికారులు పాఠశాలకు పంపిణీ చేశారు. అక్టోబర్‌లో ప్రారంభమయ్యే సెకండ్ సెమ్‌కు సంబంధించి పాఠ్యపుస్తకాలను బుధవారం మండలంలోని 27 పాఠశాలలకు ప్రత్యేక వ్యాన్ ద్వారా సరఫరా చేశారు. 1 నుండి 10 వ తరగతి వరకు గల ఈ పుస్తకాలను ఈ నెల 22 నుంచి విద్యార్ధులకు పంపీణీ చేయనున్నట్లు ఎం.ఇ.ఒ ఎన్ శివశంకరరావు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఎం.ఇ.ఒ శివశంకరరావు , ఎం.ఇ.ఒ 2 అన్నపరెడ్డి పిచ్చయ్య పర్యవేక్షించగా, సి.ఆర్.పి లు ప్రభాకర్, మీనాక్షి, రమ్య, స్వాతి ఎం.ఇ.ఒ కార్యాలయ సిబ్బంది మల్లి, స్కూల్స్‌కు అందచేశారు.

రైతులు ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : వ్యవసాయ శాఖ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైయస్ఆర్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్ సేవలను ఎడిఎ జె జయప్రద బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ ఈ కేంద్రంలో అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, నాణ్యతను పరిశీలన చేస్తామన్నారు. ఎవరికైనా రైతులకు విత్తనాలు, ఎరువులు నాణ్యతలో అనుమానాలు వస్తే ఈ ల్యాబ్‌కు తీసుకువచ్చినా యడల వాటిని పరీక్షించి రిపోర్టు ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ల్యాబ్‌లను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎఓ సుభహారిక ల్యాబ్ అసిస్టెంట్‌లు కల్పన, హేమంత్, ఆర్‌బికె సిబ్బంది లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు అయిన కృష్ణాజిల్లా, పెనమలూరు మండలం, కానూరు పంచాయితీ, సనత్‌నగర్, 4వ లైన్, మొహమ్మదీయ మస్జిద్ దగ్గర, డోరు నెం. 16-48 కాపురస్తులు-(లేటు) గఫ్ఫార్ బేగ్ గారి కుమారుడు ఇర్షాద్ అహమ్మద్ బేగ్ గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా..

నా క్లయింటు అయిన ఇర్షాద్ అహమ్మద్ బేగ్ గారు వారి తాలూకు ఆస్తికి సంబంధించిన లింకు దస్తావేజును అనగా, నా క్లయింటు తండ్రి గారైన గఫ్ఫార్ బేగ్ గారి పేరుతో గుంటూరు జిల్లా రిజిస్ట్రారు వారి ఆఫీసులో దస్తావేజు నెం. 2606/2007రుగా రిజిస్ట్రేషన్ కాబడిన ఒరిజినల్ దస్తావేజును కవరులో పెట్టుకొని జిరాక్స్ తీయించుకొనుటకు గాను ది.14-07-2023వ తేదీన ఉదయం 10.30 సమయంలో సనతనగర్ సెంటరుకు మోటారు సైకిల్‌పై వెళ్ళుచుండగా పైన తెలిపిన నెం.2606/2007 రు గల ఒరిజినల్ దస్తావేజు కవరులో నుండి జారిపోయి మార్గమధ్యలో ఎక్కడో మిస్ అయినది. కావున పై తెల్పిన నెం.2606/2007రు గల ఒరిజినల్ దస్తావేజు ఎవరికైననూ దొరికిన యెడల యీ క్రింద ఉదహరించిన చిరునామాకు అందజేయవలసినదిగా యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

T. Sri Hari Rao, B.Sc., B.L.
Advocate & Notary,
Vijayawada - 520002.

పేదలకు న్యాయం చేయటమే లక్ష్యం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : కుల, మతాలకు అతీతంగా ప్రతీ పేద, మధ్యతరగతి వారికి న్యాయం జరగాలని వారికి ఉచితంగా విద్య, వైద్యం అందించాలని, రైతులకు, కౌలు రైతులకు అండగా నిలబడాలని వారికి ఆర్థిక భరోసా కల్పించాలని లక్ష్యంతోనే జై జన సంఘం పార్టీ ఏర్పాటు చేయడం జరిగిందని ఆ పార్టీ అధ్యక్షులు రేలంగి నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం గాంధీనగర్ లోని ప్రెస్‌క్లబ్‌లో నూతన పార్టీ ఆవిర్భావం సభ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ విధివిధానాలను తెలిపారు. ముఖ్యంగా ప్రతి పేదవారికి ఉచితంగా సంవత్సరానికి 6 నుండి 8 గ్యాస్ సిలెండర్లు 200 నుండి 300 యూనిట్ల వరకు కరెంటు బిల్లు ఉచితం ప్రతి కౌలు రైతుకు ఎకరానికి 20వేల రూపాయలు పంట పెట్టుబడికి లోనుగా ఇచ్చి అందులో 25% సబ్సిడిగా ప్రతీ సంవత్సరం వర్తింపజేస్తామన్నారు.ఈ లోను 20 వేల నుండి 2 లక్షల వరకు. (1 ఎకరం నుండి 10 ఎకరాల వరకు నెలకు రూ. 3,500/-, భార్య భర్తలకు కలిపి నెలకు రూ.5 వేల వరకు వృద్ధాప్య పెన్షన్, చిరువ్యాపారులకు 50వేల నుండి 3 లక్షల వరకు బ్యాంక్ లోన్ సదుపాయం. ఈ లోను సబ్సిడి 30% వరకు రాయితీ ఇస్తామన్నారు.భావితరాల భవిష్యత్తుకు యువతకు జీవనోపాది పథకం క్రింద 1 లక్ష నుండి 5 లక్షల వరకు బ్యాంక్ లోన్ సదుపాయం.ఈ లోనుకు 40% సబ్సిడి రాయితీ. గ్రామంలో ఎన్నో కోట్లు ఖర్చు చేసి ప్రజల సొమ్మును సచివాలయాలుగా నిర్మించారు. రైతే రాజు అనే మన దేశంలో ప్రతి రైతుకు పంట పెట్టుబడి నిమిత్తం ఏడాదికి ఎకరం నుండి 10 ఎకరాల వరకు ఎకరానికి 5 నుండి 10 వేల వరకు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో రాగుల రాఘవులు,కొండ సురేష్,కేతా సత్తిబాబు,మేడిశెట్టి భీమార్జున,తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

విశాలాంధ్ర-మోపిదేవి : విద్య ద్వారానే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పలువురు వక్తలు కొనియాడారు. పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు, మెడిసిన్‌లో అత్యుత్తమ ర్యాంకుతో ప్రభుత్వ సీటు సాధించిన విద్యార్థులకు బుధవారం ఎంపీపీ రావి దుర్గావాణి, జడ్పీటీసీ మేడబలిమి మల్లికార్జునరావుల ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహకా లతో సత్కరించారు. మోపిదేవి జెడ్పీ పాఠశాలకు చెందిన మేడికొండ మోన 578 మార్కులు, పెదకళ్లేపల్లి ఎస్‌డి ఎస్ఎస్ఎస్ పాఠశాలకు చెందిన అరజా అక్షయ 569 మార్కులతో మండలంలో ప్రథమ శ్రేణిలో నిలిచి ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించగా రావివారిపాలెం గ్రామానికి చెందిన ప్రముఖ టీడీపీ నాయకులు రావి చిట్టిబాబు మనుమడు జొన్నలగడ్డ దత్త రామకృష్ణ ఆంధ్రప్రదేశ్ స్థాయిలో 292 ర్యాంక్తో ఎంబీబీఎస్ సీటు సాధించారు. ముగ్గురు విద్యార్థులను ఎంపీపీ, జడ్పీటీసీ, సీడీసీ చైర్మన్. రావి నాగేశ్వరరావు, మోపిదేవి ఎస్ఐ సిహెచ్.పద్మలు ఘనంగా సత్కరించారు. ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించి, మోన, అక్షయలకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు కావూరి రామకృష్ణ, వేమలపల్లి పిచ్చేశ్వరరావు, బొందలపాటి ప్రసాద్, రావి హేమంత్ పాల్గొన్నారు.

హిందుస్థాన్ స్కౌట్ అండ్ గైడ్స్ ఆంధ్రప్రదేశ్ కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ప్రభుత్వ ప్రైవేటు స్కూళ్లలలో యూత్ అసోసియేషన్ విద్యార్థులకు నైతిక విలువలను దేశభక్తిని ప్రజాసేవ న్యాయకత్వ లక్షణాలను పెంపొందించే విధంగా విద్యార్థి దశలోనే శిక్షణ ఇవ్వడం హిందూస్తాన్ స్కౌట్ అండ్ గైడ్స్ ప్రధాన లక్ష్యమని దీనిని ఆంధ్రప్రదేశ్‌లో కూడా మరింతగా బలోపేతం చేసే విధంగా నూతన కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు నేషనల్ సెక్రటరీ వినోద్ కుమార్ బిదురితెలిపారు. బుధవారం గాంధీనగర్‌లోని ఫిలిం ఛాంబర్‌లో ఒక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ హిందూస్తాన్ స్కౌట్ & గైడ్స్ అనేది ఒక జాతీయ సంస్థ ఈ సంస్థ మినిస్ట్రీ ఆఫ్ యూత్-స్పోర్ట్స్ లో భారత ప్రభుత్వం నుండి గుర్తింపు పొందినదని తెలిపారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు.నేషనల్ హెడ్ కోటర్ కమిషనర్‌గా దుగ్గపోగు సుధీర్ బాబు,ఆంధ్రప్రదేశ్‌కు నూతన చైర్మన్ పోతుమంచి గిరిధర్ రాజు,చీఫ్ కమిషనర్‌గా రావి ముత్యాలరాజు,సెక్రటరీగా జ్ఞాపకాలను జోన్నిగలసంపత్, కమిషనర్‌గా రెడ్డిమ్ దుర్గా ప్రసాద్,హెడ్ క్వార్టర్ కమిషనర్‌గా మానికొండ శ్రీధర్‌ను నియమించారు.ఈ సమావేశంలో రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాల జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్‌లు కె.రాజేష్ ఎం.మాధురి,ఎం.గణేష్,రాజశేఖర్ సోమిశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని సమాధి చేస్తున్న బీజేపీ

విశాలాంధ్ర-రెడ్డిగూడెం : దేశాన్ని పాలిస్తున్న బీజేపీ ప్రభుత్వం, కుల, మత, ప్రాంత, జాతులు, భాషలు సంస్కృతులు, తెగల మధ్య చిచ్చుపెట్టి దేశాన్ని విచ్ఛిన్నం చేసే విధంగా మతతత్వ, మనువాద విధానాలతో మన రాజ్యాంగ స్ఫూర్తిని లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థను సమూలంగా సమాధి చేసే దుష్టపాలన సాగిస్తున్నదని, బీజేపీని గద్దె దించేందవరకు అ విశ్రాంతంగా ఉద్యమించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. ఎన్టీఆర్‌జిల్లా మైలవరం నియోజకవర్గ సమావేశం రెడ్డిగూడెం కమ్యూనిటీ హాలు సెంటర్ సెంటర్‌లో జరిగింది. ఈ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీహెచ్ కోటేశ్వరరావు ప్రసంగిస్తూ ప్రపంచంలో ఏ దేశంలోనూ లేని విధంగా విలక్షణంగా విభిన్నజాతులు, కులాలు, మతాలు, భాషలు, ప్రాంతాలు తెగలు, సంస్కృతులతో భిన్నత్వంలో ఏకత్వంగా అత్యంత విలువ కలిగిన మన రాజ్యాంగంలో మనుగడ సాగిస్తున్న మనదేశ ప్రతిష్టను మంట కలిపే విధంగా వినాశనకకర, రాక్షసపాలన సాగిస్తోందని తీవ్రంగా విమర్శించారు. దళిత, గిరిజన, మైనార్టీ, బలహీన వర్గాలు, మహిళలపై దాడులు, దౌర్జన్యాలు అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని, మసీదులలో చర్చిలలో హింధుయేతర దేవాలయాలను ధ్వంస చేస్తున్నారని, రాజకీయ ప్రత్యర్థులపై సీబీఐ, ఈడీ వంటి వ్యవస్థలతో దాడులు చేయిస్తూ తనవైపు బలవంతంగా తిప్పుకోవడం, ఎంపీలను, శాసన సభ్యులను అనేక ప్రలోభాలతో లొంగతీసుకొని బీజేపీయేతర తన ప్రభుత్వాలను పడగొట్టి పిరాయింపులులతో బీజేసీ ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకుని ఆ రాష్ట్రాలను సర్వనశానం చేస్తుందని అన్నారు. ఉదాహరణకు మణిపూర్‌లో తెగల మధ్య చిచ్చుపెట్టి మారణహోమాన్ని సృష్టించిందని అన్నారు. ఇంత దుర్మార్గపు బీజేపీ ప్రభుత్వాన్ని ఒక్క క్షణం కూడా అధికారంలో ఉండకూడదని అన్నారు. మన రాష్ట్రంలో కూడా ప్రజా సమస్యలపై పోరాడే హక్కులేకుండా నిర్బంధాలు అరెస్టులతో కేసులతో ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురి చేస్తుందని ప్రజాస్వామ్య రక్షణకు మనమంతా తిరుగుబాటు చేయాలని అన్నారు. సీపీఐ మైలవరం నియోజకవర్గ కార్యదర్శి బుడ్డి రమేష్, మహిళ సమాఖ్య జిల్లా నాయకురాలు సీహెచ్ దుర్గా కోటేశ్వరరావు, సీపీఐ రెడ్డిగూడెం మండల కార్యదర్శి అడపా సుబ్బారావులు ప్రసగించారు. చింత రాంబాబు, బండపల్లి వందనం, బడిపాటి చంటి, సగ్గుర్తిఎర్రయ్య, బడిపాటి సావిత్రి, చింతిరాల లలిత, చాట్ల సత్యవతి, తదితరులు నాయకత్వం వహించారు.

తొలకరి పలకరింపు రైతులకు అవగాహన

విశాలాంధ్ర-గంపలగూడెం : జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారిని బి. సత్యవతి స్థానిక రైతు భరోసా కేంద్రంలో బుధవారం నాడు వివిధ పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు .నేల ఆరోగ్యం గురించి ఆర్గానిక్, కార్బన్ శాతం ఉండవలసిన మోతాదు, సేంద్రియ పదార్థం నేలలో సమ పాలలో ఉండటం వలన ఉపయోగాలు గురించి వివరించారు .సూటి ఎరువులు మరియు కాంప్లెక్స్ ఎరువులు ఎప్పుడు ఎలా వాడాలో , సేంద్రీయ మరియు జీవన ఎరువులు వాడటం వలన ఉపయోగాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోట. పుల్లమ్మ, వ్యవసాయ శాఖ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

ఆగస్టు 16 నుంచి జరిగే బస్సు యాత్రను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-విజయవాడ : దేశంలో ప్రధాని మోదీ రాష్ట్రంలో సీఎం జగన్ ప్రభుత్వాలు అధిక ధరలు, ప్రజా వ్యతిరేక విధానాలు నిరసిస్తూ సీపీఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 16 నుండి సెప్టెంబర్ 6 వరకు 'రాష్ట్రాన్ని రక్షించుకుందాం-దేశాన్ని కాపాడుకుందాం'అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్నా బస్సుయాత్రను విజయవంతం చేయాలని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు, డిప్యూటీ కార్యదర్శి దోనేపూడి శంకర్ కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ నగర కమిటీ సంయుక్త సమావేశం విజయవాడ దాసరి భవన్‌లో ఎస్ కే నజీర్ అధ్యక్షతన జరిగింది. విజయవాడ నగర సహాయ కార్యదర్శి ప్రజానాట్యమండలి ఇన్చార్జి లంక దుర్గారావు, ప్రజానాట్యమండలి జాతీయ సమితి సభ్యులు ఆర్. పిచ్చయ్య తదితర నాయకులు ఈ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి రాగానే వంద రోజుల్లో అధిక ధరలు తగ్గిస్తామని చెప్పారు గాని అవి రోజు రోజుకు పెరుగుతూనే ఉన్నాయన్నారు. విదేశాలు నుండి నల్లధనం తీసుకొస్తానని ఆ డబ్బులు ప్రజలందరికీ పంచుతానని వాగ్దానం చేసి ఇప్పుడు ఒక అదాని, అంబానీలకే దేశ సంపదను దోచి పెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి కూడా ఆయన అడుగుజాడల్లో నడుస్తూ సంక్షేమ పథకాల పేరుతో బటన్ నొక్కుతూ ఇచ్చేది పిసరంతా, పన్నుల రూపంలో విద్యుత్ ఛార్జీల పేర్లతో ప్రజల నుండి దోచుకుంటుంది కొండంత అని విమర్శించారు. బస్సు యాత్ర సందర్భంగా జిల్లా, నగర ప్రజానాట్యమండలి కళాకారులు వివిధ కళారూపాలతో నాటిక దళాలతో పాల్గొని బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నగర గౌరవ అధ్యక్షులు కేవీ. భాస్కరరావు, నగర కార్యదర్శి దోనేపూడి సూరిబాబు, కోశాధికారి కాళ్ళ చిన్నప్ప, ఎస్ రంగారావు, శర్మ ,దాసరి రంగారావు, ఎస్.కె భాష అంజిబాబు బల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి పెద్ద పీట

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : తెలుగుదేశం పార్టీ హాయంలో మహిళా సంక్షేమానికి టీడీపీ పెద్ద పీట వేయటం జరిగిందని, వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు వేసి తద్వారా మహిళా అభ్యున్నతికి పునాదులు వేయాల్సిన అవసరం ఉందని కార్పొరేటర్ దేవినేని అపర్ణ పిలుపునిచ్చారు. తూర్పు నియోజక వర్గంలోని 6వ డివిజన్ బ్రహ్మానందరెడ్డి నగర్‌లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయనున్న మహిళా సంక్షేమ పథకాలపై ఆమె బుధవారం ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉప్పుడున్న మహిళా సంఘాలు ఏర్పాటు చేసింది టీడీపీనేనన్నారు. సంక్షేమం పేరుతో అరకొర పథకాల డబ్బులు ఇచ్చి వాటికన్నా రెట్టింపు వివిధ పన్నుల పూపాల్లో వైసీపీ ప్రభుత్వం ప్రజల నుంచి గుంజుతోందని గ్రహించాలన్నారు. టీడీపీ హాయంలో రూ.450 ఉన్న గ్యాస్ నేడు రూ.1150కు చేరిందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఏడాదికి 3 గ్యాస్ సిలెంటర్లు ఉచితంగా అందజేస్తామన్నారు. 18ఏళ్ళు నిండిన ప్రతి ఆడపిల్లకు నెలకు రూ.1500 ఇవ్వటంతో పాటు జిల్లాలో మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఇలా అనేక సంక్షేమ కార్యక్రమాలు టీడీపీలో చేర్చటం జరిగిందని ప్రజలు గమనించి ఆదరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ పార్లమెంట్ టీడీపీ మహిళా అధ్యక్షులు చెన్నుపాటి ఉషారాణి, నాయకులు కే.నాగమణి, ఎం.చిన్నతల్లి, షకీలా బేగం, పీ.రత్నశ్రీ, పీ.లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ నియోజకవర్గంలో

రూ.7 కోట్ల అభివృద్ధి పనులు

వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి తానేటి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో రూ.7కోట్లుతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖామంత్రి, జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి తానేటి వనిత తెలిపారు. నగరంలోని 30వ డివిజన్ దేవినగర్‌లో డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని బుధువారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా రాష్ట్రాన్ని అభివృద్ధిపర్చాలనే ముఖ్యమంత్రి వైయస్ జగన్ సారధ్యంలో అనేక కోట్ల రూపాయల అభివృద్ధి జరుగుతుందన్నారు. 14, 15వ ఆర్థిక సంఘం-ఎయిర్ పొల్యూషన్ గ్రాంటు క్రింద మంజూరయిన రూ.7.00 కోట్ల నిధులను ఉపయోగించి రోడ్ల అభివృద్ధి, వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం ప్రారంభించినట్లు తెలిపారు. వైద్య, ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి నిరు పేదలకు మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య, పట్టణ ఆరోగ్య కేంద్రాలను నాడు-నేడు కార్యక్రమం ద్వారా ఆధునీకరించటం, పట్టణ ప్రాంతాల్లో ప్రతీ 30 వేల జనాభాకు ఆరోగ్య కేంద్రం అందుబాటులో ఉంచి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆయా కేంద్రాల్లో 64 వైద్య పరీక్షలు, 172 రకాల మందులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను మెరుగుపర్చేందుకు ప్రజా ప్రతనిదులు అధికారులను సమన్వయం చేసికొని ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే ఎం.విష్ణువర్ధన్ మాట్లాడుతూ సెంట్రల్ నియోజకవర్గంలో ఎన్నడూ లేని అభివృద్ధి జరిగిందని, కొత్తగా అభివృద్ధి చెందుతున్న కాలనీలు సైతం నేడు అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి నిరంతరం నియోజకవర్గంలో అభివృద్ధిని పర్యవేక్షిస్తూ ముందుకు తీసుకువెళ్లటం అభినందనీయమని, పార్టీలకు అతీతంగా అన్ని ప్రాంతాలు అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వం ఉద్దేశ్యమని పేర్కొన్నారు. నగర మేయర్ భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించటంలో నగర పాలక సంస్థ అనేక కోట్ల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయటం జరిగిందన్నారు. నియోజక వర్గంలోని 32వ డివిజన్ లోటస్ ల్యాండ్ మార్క్ సెక్టార్-1లో రూ.152.00లక్షల 14వ ఆర్థిక సంఘం నిధులతో 2, 7, 8, 9, 11, 12 రోడ్లును సీసీ రోడ్లు, 30వ డివిజన్ దేవీనగర్‌లో రూ.105.15లక్షల ఎన్‌యుహెచ్ఎం, ఏపీహెచ్ఎస్ఎస్‌పీ, వీఎంసీ సాధారణ నిధులతో వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మాణం, 61వ డివిజన్‌లోని పాయకాపురం చెరువు చుట్టూ రూ.371.63 లక్షల 14, 15వ ఆర్థిక సంఘం, వీఎంసీ సాధారణ నిధులతో వైఎస్ఆర్ పార్కు, రాజీవ్‌నగర్ పార్క్‌లో రూ.75.00 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో ఓపెన్ సైట్ అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీ.శ్రీనివాసరావు, నగర డిప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

విజయవంతంగా 'జగనన్న సురక్ష'

4 లక్షల 2 వేల 986 గృహాల్లో సర్వే పూర్తి : కలెక్టర్ ఎస్.డిల్లీరావు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : జిల్లాలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి అధికారులు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతీ ఇంటినీ సందర్శించి సమస్యలు పరిష్కరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. జిల్లాలో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంపై స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ బుధవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, వలెంటీర్లు ప్రతీ ఇంటిని సందర్శించి వారి సమస్యలను తెలుసుకుని జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమం జిల్లాలోని 16 మండలాలు 4 మున్సిపాలిటీలు, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు మొత్తం 605 సచివాలయాల్లో 10,671మంది వలెంటీర్లు ప్రతీ ఇంటికి వెళ్ళి వలెంటీర్ యాప్ ద్వారా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించి ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లు సేకరించి టోకెన్‌లను అందజేశారన్నారు. జూలై 1 నుండి గ్రామ, వార్డు సచివాలయల్లో ప్రత్యేక క్యాంపులను నిర్వహించి అర్హులైన వారికి ధృవపత్రాలు, సర్టిఫికెట్లు అందిస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 449 సచివాలయాల్లో క్యాంపులు నిర్వహించామని, చందర్లపాడు, ఎ కొండూరు, ఇబ్రహీంపట్నం, రెడ్డిగూడెం, మండలాలతో పాటు కొండపల్లి మున్సిపాలిటీలో జగనన్న సురక్ష క్యాంపులు పూర్తి చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా సచివాలయాల్లోని 5,34,897 గృహాలకు 4,02,986 గృహాల్లో సర్వే పూర్తి చేసి 2,32,401 సర్టిఫికేట్లు అందజేశామన్నారు. వీటిలో ఎక్కువగా 97,154 ఇంటిగ్రేటెడ్, 89,206 ఆదాయ, 10,177 ఆర్ఓఆర్1బి, 10,105 రీఎస్యూరెన్స్ ఇంటిగ్రేటెడ్, 8,272 అడంగల్, 6,844 రీఎస్యూరెన్స్ ఆదాయ సర్టిఫికేట్లు, 6,378 ఆధార్‌తో మొబైల్ అనుసంధానం, 2,023 ఆధార్‌కు చిరునామ సర్టిఫికేట్లు ఉన్నట్లు వివరించారు.

నమ్మండి...ఇది రోడ్డేనండీ...

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు విస్సన్నపేట మండలంలోని పలు రహదారులు నీటితో నిండి, తటాకాలను తలపిస్తున్నాయి. మండలంలోని తాతకుంట్ల పంచాయతీ యాదవ బజారులో పలు రహదారులకు మురుగుకాలువ సదుపాయం లేకపోవటంతో నీటిలో మునిగి, కనీస రాకపోకలు సైతం కరవయ్యాయి. పలు రహదారులు నీటిగుంటలుగా మారటంతో ఈ ప్రాంతంలో నడిచేందుకు సైతం ఆస్కారం లేక ఈ ప్రాంత వాసులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు.

'పేట'లో తెలుగు మహిళల నిరసన

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులు, హింసలకు నిరసనగా జగ్గయ్యపేట పట్టణంలో తెలుగుదేశం పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణంలోని బంగారు కొట్ల సెంటర్ నందు గల శ్రీ స్వయంభు విఘ్నేశ్వర స్వామి వారి దేవాలయం వద్ద ప్లకార్డులతో ర్యాలీగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కన్నెబోయిన రామలక్ష్మి మాట్లాడుతూ తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత పై సోషల్ మీడియాలో వైసీపీ పేటీఎం బ్యాచ్ తప్పుడు ప్రచారం చేయటం నీచమైన పద్ధతని ఆవేదన వ్యక్తం చేశారు.వైసిపి అక్రమాలను ప్రశ్నించే వారి వ్యక్తిత్వాన్ని కించ పరచడమే వైసిపి పేటియం బ్యాచ్ కి కూలి పనిగా మారిందన్నారు. మహిళలని కించపరిచేలా పోస్టులు పెడుతుంటే సాటి మహిళగా భారతీ రెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు?అనిత పై అసభ్యకరంగా పోస్టులు పెట్టిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ చేశారు. మహిళల ఆత్మ గౌరవాన్ని కించపరిచేలా వ్యవహరిస్తున్న వైసీపీ పేటీఎం బ్యాచ్ కి ప్రజల చేతుల్లో చెప్పు దెబ్బలు ఖాయమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మేక వెంకటేశ్వర్లు,,మాజీ జెడ్పిటిసి అమ్మనబోయిన రాణి,నాయిని రజిని, గోనెల పద్మ, తేలపుట్ల మణెమ్మ, వేముల వజ్రం, మేళ్లచెరువు సువార్త, పతాని దానమ్మ, అమ్మనబోయిన జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో ఈనెల 20వ తేదీన ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు స్థానిక లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వేమూరి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక లయన్స్‌క్లబ్ భవనంలో ఉదయం 9గంటల నుంచి ప్రారంభించనున్న ఈ శిబిరంలో విజయవాడ ఆంధ్ర ఆసుపత్రి వైద్యులు సేవలందించనున్నట్లు ఆయన వివరించారు. రోగులంతా ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అంజయ్య చౌదరికి విజయ డైరీ చైర్మన్ చలసాని సత్కారం

విశాలాంధ్ర-విజయవాడ : అమెరికాలోని అట్లాంటా నగరంలో లావు అంజయ్య చౌదరి నివాసంలో ఆయన రెండు సంవత్సరాలు తానా అధ్యక్షులు గా సమర్ధవంతంగా పదవీ బాధ్యతలు నిర్వహించి ఇటీవల పదవీ కాలం ముగిసినసందున వారికి కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పుష్ప గుచ్ఛం ఇచ్చి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ కృష్ణా జిల్లా వాసి అయిన అంజయ్య చౌదరి దశాబ్దంపైగా తానా సంస్థకు సేవలను అందిస్తూ, మరీముఖ్యంగా గడిచిన రెండు సంవత్సరాలు గా తానా అధ్యక్షుడుగా అనేక అభివృద్ధి, సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు అందుకోవడం తెలుగు వారికి మరి ముఖ్యంగా కృష్ణా జిల్లా వారికి ఎంతో గర్వకారణం అని కొనియాడారు. ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే ముందుగా ఉన్నతమైన మనసుండాలన్నారు. సమాజ హితం కోరుకునే మంచి మనసుతో పాటుగా, కష్టంలో వున్న వారి నుండి ఏ ప్రతి ఫలం ఆశించకుండా సాయపడే గుణముండాలని అలాంటి లక్షణాలు ఉన్న వ్యక్తి అంజయ్య చౌదరి అన్నారు. అందుకే ఆయనను అనేక పదవులు వరించాయని ఆంజనేయులు ప్రశంసించారు. ఈ రెండు సంవత్సరాల కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా ఉమ్మడి కృష్ణా జిల్లాలో అంజయ్య చౌదరి తానా సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, ఈ సేవా కార్యక్రమాలలో కొన్ని సేవా కార్యక్రమాలు కృష్ణా మిల్క్ యూనియన్ భాగస్వామ్యంతో పాడి రైతులకు అందించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంజయ్య చౌదరి సతీమణి నటాషా, తల్లిదండ్రులు లావు సాంబశివరావు, శివరాణి పాల్గొన్నారు.

చేనేత రంగాన్ని కాపాడటమే లక్ష్యం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : భారతీయ సాంప్రదాయ కళ చేనేత రంగాన్ని అదే రంగాన్ని జీవనాధారం చేసుకుని జీవిస్తున్న అన్ని వర్గాల ప్రయోజనాలు కాపాడటానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై వత్తిడి తీసుకురావటమే ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ లక్ష్యంగా ముందుకు సాగుతుందని ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు బండారు ఆనంద్ ప్రసాద్ తెలిపారు. బుధవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలోని అనేక చేనేత కులంలో ఉన్నప్పటికీ అన్నీ చేనేత కులాలు విడివిడిగా ప్రయాణం చేయటం వలన చేనేత వృత్తి పరిరక్షణ చేనేత కార్మికులు కష్టాలను అధిగమించుట కష్టంగా ఉన్నదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తో ప్రతినిత్యం వహించడానికి దేశవ్యాప్తంగా ఉన్న అన్ని చేనేత కులావములను కలుపుతూ ఒక సమిష్టి వేదిక లేని కారణంగా చేనేత కులములు సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా చాలా నష్టపోతున్నాయని అన్నారు. చేనేతలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ ప్రాధన్యత కల్పించాలని డిమాండ్ చేశారు.భారతీయ సాంప్రదాయ కళ చేనేత వృత్తికి ప్రధాన ముడిసరుకు అయిన చిలవలు జి.ఎస్.టి. విధించటం నూలు ఉత్పత్తి చేసే మిల్లులు కనీసం 50% చిలప నూలు ఉత్పత్తి చేయటాని నిబంధనలను పవర్ లూమ్స్ ఉత్పత్తిదారులు ఒత్తిడి మేరకు 40% తగ్గించడం అధిక శాతం మేరకు చిలపనూలు ఉత్పత్తి చేయకపోవడం వలన కూదులు అయ్యిందన్నారు.11 రకాలు వస్త్రాలు కూడా టెక్స్టైల్స్ మిల్స్ నిబంధనలకు వ్యతిరేకంగా వస్త్ర ఉత్పత్తి చేయడం చేనేత వ్యవస్థను సమూలంగా చేనేత వ్యవస్థలను నాశనం చేయుటమేఅవుతుందన్నారు.తక్షణం జీఎస్టీలను తొలగించాలన్నారు. రాష్ట్ర అధ్యక్షులు ఇనుమాల శివరామ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా పప్పు రాజారావు, కోశాధికారి నాప కుమార స్వామి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బోళ్ల లలితరాణి, కార్యదర్శి ఐశెట్టి సత్యవతి ఉన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది,సామాజిక న్యాయకేంద్రం రాష్ట్ర కన్వీనర్ వై.కోటేశ్వరరావు(వైకే) జాతీయ ప్రధాన కార్యదర్శి డా.సమతం రమణ మహేష్, జాతీయ అధికార ప్రతినిధి రాపోలు జగన్, జి.రాందాస్, కె.రజనీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

గంగానమ్మ ఆలయంలో చోరీ

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నంలోని గంగానమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీస్ స్టేషన్ నుండి విటిపిఎస్ మెయిన్ గేట్ కు వెళ్ళు దారిలో రిజిస్టర్ కార్యాలయం వద్దనున్న గంగానమ్మ అమ్మవారి దేవాలయంలో మంగళవారం రాత్రి చోరీ జరగగా, బుధవారం ఉదయం ఆలయ పూజారి గుడి తెరిచేందుకు ఆలయం వద్దకు వచ్చారు, గుడి గేట్లకు ఉన్న తాళాలు పగిలిపోయి ఉండటాన్ని గమనించి వెంటనే ఈ విషయాన్ని ఆలయ కమిటీ సభ్యులకు తెలియజేయగా, ఆలయ కమిటీ సభ్యులు పోలీసులను సంప్రదించి క్లూస్ టీం వచ్చేంతవరకు గుడి గేట్లు తీయలేదు. అమ్మవారి కి చెందిన లక్షన్నర విలువైన వస్తువులు, మరియు ఆలయం లోపల ఉన్న హుండీ కూడా అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఆలయ కమిటీ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర-వీరులపాడు:ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, ప్రజా రవాణా, గూడ్స్ రవాణా చేసే డ్రైవర్లు కాకీ యూనిఫామ్ ధరించాలని సూచించారు. బుధవారం వీరులపాడు గ్రామంలో వాహనాలను తనిఖీ నిర్వహిస్తూ డ్రైవర్లకు ఎస్సై మహాలక్ష్ముడు పలు సూచనలు చేశారు. పరిమితికి మించి ఎక్కువ మందిని ఆటోలో ఎక్కించరాదని ఆటో డ్రైవర్లకు తెలిపారు. సరైన పత్రాలు లేని వాహనాలకు, నిబంధనలను పాటించని డ్రైవర్లకు చలనాలు రాశారు.

మైనార్టీ సదస్సు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-నందిగామ రూరల్ : నందిగామ నియోజకవర్గ తెలుగుదేశం మైనార్టీ సెల్ సదస్సును విజయవంతం చేయాలని నియోజక వర్గ మైనార్టీ సెల్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ దిలావర్, షేక్ ఖాజలు బుధవారం స్థానిక కాకానినగర్‌లోని మాజీ ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన సమావేశంలో కోరారు. 23వ తేదీ ఆదివారం స్థానిక ఆర్ఎస్‌గార్డెన్‌లో తెలుగదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో జరగనున్న ముస్లిం మైనార్టీల సదస్సుకు నియోజకవర్గంలోని ముస్లిం మైనారిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని వియవంతం చేయాలని వారు తెలిపారు. ఈ నియోజకవర్గ ముస్లిం మైనారిటీ సదస్సుకు ముఖ్య అతిధులుగా మాజీ ఎమ్మెల్సీ, శాసనమండలి మాజీ చైర్మన్ జనాబ్ షరీఫ్, మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, నెట్టెం రఘురాం, మాజీ ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, శ్రీరామ్ తాతయ్య, రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు ముస్తాక్ అహ్మద్ర తదితర రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ వివిధ అనుబంధ కమిటీల నాయకులు పాల్గొంటారని వారు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పార్టీ అధికార ప్రతినిధి ఎండి అలి పాషా, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ ఇమాం జాని తదితర మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు నెరవేరిన కల...

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: మండలంలోని తాతకుంట్ల పంచాయతీ గౌరంపాలెం గ్రామంలోని మైనార్టీ సామాజికవర్గ ప్రజలు గత కొన్ని సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. గ్రామంలోని ముస్లిం సామాజికవర్గం అంత్యక్రియల ఏర్పాటుకు గ్రామ సమీపంలోని ఒక ప్రాంతాన్ని వినియోగిస్తున్నారు. ఈ ప్రాంతానికి రహదారికి మధ్యలో పెద్ద వాగు ఉండటంతో ఖనన సమయంలో పలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని ఇక్కడికి వచ్చిన పలువురు ప్రజాప్రతినిధుల వద్ద చెప్పుకున్నా, పరిష్కారానికి మాత్రం నోచుకోలేదు. గ్రామ ప్రముఖుడు, మాజీ సర్పంచి ఎన్.టి.వెంకటేశ్వరరావుకు ఈ విషయం తెలియటంతో తనవంతు సాయంగా వాగుపై వంతెన నిర్మాణానికి ముందుకొచ్చారు. అప్పటికప్పుడు తన సొంత నిధులు రూ.60వేల వరకు వెచ్చించి, వంతెన నిర్మాణం చేశారు. ఏళ్ల తరబడి కొనసాగుతున్న సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించటంతో ముస్లిం ప్రముఖులు పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మహారాజశ్రీ విజయవాడ 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

O.S.No.1448/2021

Between
Canara Bank, Satyanarayana puram Branch, Vijayawada, Rep by its Manager **- Plaintiff**
and
Talari Rajesh, S/o. Vijaya Nageswara Rao, R/o. D.No. 2001, Handiwadi Road, Hadapsar, Maharastra State- 411028.
- Defendant

పై నంబరు దావా వాది బ్యాంకువారు మీపై **రూ.6,20,913-21పైసలు** మరియు వడ్డీ ఖర్చులు వగైరాలు రాబట్టుకొనుటకు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు యెట్టి అభ్యంతరములు ఉన్నయెడల తెలుపుకొనే నిమిత్తం ది. **3-8-2023వ తేదీ ఉదయం గం.10.30ని.లకు** పైకోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేక ప్లీడరు గారి ద్వారాగాని హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల మీ వరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

దాసు త్రివిక్రమవ్యాస్,
వాది బ్యాంకు తరపు న్యాయవాది,
గాంధీనగర్, విజయవాడ - 520003.
సెల్ : 9848207621.
విజయవాడ, 17-07-2023